ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
చిత్తూరు జిల్లా వార్తలు
గురువారం 7 మార్చి 2024



రూ.750 కాదు.. 500 మాత్రమే

● వలంటీర్లకూ ఇచ్చిన మాట తప్పిన జగనన్న

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 6: రేషన్ పంపిణీ పర్యవేక్షణకుగాను ప్రోత్సాహకంగా రూ.750 ఇస్తామని జగన్ ప్రభుత్వం చెప్పింది. చివరకు ఆ మొత్తాన్ని రూ.500కు కుదించింది. ఈ మేరకు మూడు నెలలకుగాను రూ.1500ను ఈ నెలాఖరున చెల్లిస్తామని పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వం కార్యక్రమాలే కాదు.. పార్టీపరంగానూ తమను వాడుకుని ఇలా ప్రోత్సాహకాన్ని తగ్గించడంపై వలంటీర్లు మండి పడుతున్నారు.

జిల్లాలో 5.45 లక్షల రేషన్‌కార్డులకు 336 ఎండీయూ (మొబైల్ డిస్పెన్సరీ యూనిట్) వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ జరుగుతోంది. ఇందులో జనవరి నుంచి వలంటీర్లను భాగస్వాములను చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తమ పరిధిలో రేషన్ పంపిణీ వాహనం రాకపై ఒకరోజు ముందే కార్డుదారులకు సమాచారం ఇవ్వాలి. సరుకులు తీసుకునే క్రమంలో లబ్ధిదారులు వేలిముద్రలు వేయడంలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే అక్కడికక్కడే పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. ఏవైనా లోపాలు, అవకతవకలు జరిగినట్లు గుర్తిస్తే వీఆర్వో లేదా డీటీలకు తెలియజేయాలి. దీనికోసం గ్రామ, వార్డుల్లోని సుమారు 8200 మంది వలంటీర్లకు అదనపు పారితోషికం రూపేణా రూ.750 ఇస్తామని తొలుత చెప్పి.. తాజాగా రూ.500కు తగ్గించింది. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు కలిపి ఒకేసారి రూ.1500 చొప్పున చెల్లిస్తామని ప్రకటించింది.



మండుతున్న ఎండలు

గాంధీ సర్కిల్‌లో తగ్గిన జనసంచారం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 6: వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలోని పలు మండలాల్లో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. బుధవారం ఒక్కసారిగా ఎండలు మండాయి. అధిక ఉష్ణోగ్రతతో పాటు ఉక్కపోత ప్రారంభమైంది. బుధవారం చిత్తూరులో 35డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం నుంచి ఆదివారం వరకు 35- 37డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. రాత్రివేళల్లోనూ ఉష్ణోగ్రత 32 డిగ్రీలకు తగ్గడం లేదు. పెరుగుతున్న ఎండ తీవ్రతతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. మధ్యాహ్న సమయంలో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

చిత్తూరుకు ఏమీ చేయలేకపోయా

- హామీలు తప్ప సహకరించని సీఎం
- ఎమ్మెల్యే, రాజ్యసభ టికెట్ ఇస్తానని మోసం
- వైసీపీకి రాజీనామా చేసిన ఆరణి
- నేడు పవన్ సమక్షంలో జనసేనలో చేరిక

చిత్తూరు సిటీ, మార్చి 6: 'చిత్తూరు నియోజకవర్గంలోని సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి గురించి పలుమార్లు సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లా. ప్రతిసారి హామీలు ఇచ్చారే తప్ప, ఒక్క పనికీ సహకరించలేదు. ఈ ఐదేళ్ల చిత్తూరుకు ఏమీ చేయలేకపోయా' అని వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆవేదన వ్యక్తంచేశారు. చిత్తూరులోని తన నివాసంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. వైసీపీ ప్రభుత్వ తీరు, తనకు జరిగిన అవమానాల గురించి వివరించారు. వైసీపీకి రాజీనామా చేసిన ఆయన, గురువారం జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలో రోడ్ల గుంతలు పూడ్చడానికి కూడా నిధులు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వంలో వేసిన రోడ్లు పూర్తిచేయడానికి రూ.20 కోట్లు అవసరమని అడిగినా రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. 'ఐదేళ్లుగా నన్ను ఆదరించిన చిత్తూరు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు. సీఎం జగన్, వైసీపీ అధిష్ఠానం సూచించిన అన్ని కార్యక్రమాలను నేను చిత్తశుద్ధితో నిర్వహించా. చాలావాటిలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ ఎమ్మెల్యేగా స్థానం సంపాదించుకున్నా. చిత్తూరు టికెట్ మళ్లీ నాకు ఇస్తానని రెండేళ్ల కిందట సీఎం జగన్ హామీ ఇచ్చారు. వైసీపీ బస్సుయాత్ర సభలోనూ నన్నే ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు. గత నెలలో సీఎంను కలిసినప్పుడు ఎమ్మెల్యే టికెట్ కాకుండా రాజ్యసభ ఇస్తానని, తర్వాత ఏపీఐఐసీ చైర్మన్ పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. తీరా అదికూడా లేకుండా మోసం చేశారు. ఇన్నాళ్లూ ప్రభుత్వ భాగస్వామ్యంలో ఉన్నా కాబట్టి ప్రశ్నించలేకపోయా. సీఎం వ్యవహార శైలితో వైసీపీ ఎమ్మెల్యేలు చాలా అసంతృప్తితో ఉన్నారు. పార్టీలో అనేక అవమానాలు భరించాను. ఇక ఉండలేక బయటికి రావాల్సి వచ్చింది. చిరంజీవి కుటుంబంతో నాకు చాలా సన్నిహిత సంబంధాలున్నాయి. ఆ దిశగానే జనసేన పార్టీలో గురువారం చేరబోతున్నా' అని ఆరణి చెప్పారు. చిత్తూరులో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్ మోహన్ గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు తనను ప్రజలు గెలిపించారని ఎమ్మెల్యేగా కొనసాగుతానని చెప్పారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

పార్టీ చూపు.. అటు వైపే

ఒక నియోజకవర్గంలో ఎమ్మెల్యేను కాదని వ్యతిరేకవర్గాన్ని పార్టీ అధిష్ఠానం అందలమెక్కిస్తే.. అధికారులూ ఆ వర్గానికే వంత పాడితే.. చివరికి వ్యతిరేకవర్గమే టికెట్ తెచ్చుకుంటే.. అంతకు మించిన అవమానం ఆ ఎమ్మెల్యేకు ఏముంటుంది? చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విషయంలోనూ అదే జరిగింది.దీని పర్యవసానం పార్టీకి ఆయన రాజీనామా, జనసేనలో చేరికకు దారి తీసింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

- చిత్తూరులో ఎమ్మెల్యే వ్యతిరేక వర్గానిదే పైచేయి
- పార్టీలోనూ.. ప్రభుత్వపరంగా ప్రాధాన్యంలేని ఆరణి
- ఐదేళ్లుగా అవమానాలు
- విసిగి బయటకు వచ్చిన శ్రీనివాసులు

మేయర్, డిప్యూటీ మేయర్లను నియమించుకోలేని దుస్థితి

స్థానిక సంస్థల ఎన్నికల్లో చిత్తూరు కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా తన మనిషి ప్రేమ్‌కుమార్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రతిపాదించారు. ఈ మేరకు ప్రేమ్‌కుమార్ తన సచివాలయ ఉద్యోగానికి రాజీనామా చేసి ఇరువారం డివిజన్ నుంచి పోటీ చేశారు. ప్రేమ్‌కుమార్ గెలిస్తే మేయర్ అవుతారని ఎమ్మెల్యే వ్యతిరేకవర్గం ఓడించిందనే ఆరోపణలున్నాయి. ప్రేమ్ కుమార్ ఓడిపోవడంతో రీడ్స్‌పేట డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా గెలిచిన షర్మిళప్యారీని మేయర్‌గా ఎమ్మెల్యే ప్రతిపాదించినా కుదరలేదు. చివరకు అముదను మేయరుగా ప్రకటించారు. ఇద్దరు డిప్యూటీ మేయర్ల విషయంలోనూ ఎమ్మెల్యే మాట చెల్లలేదు. అలాగే గుడిపాల జడ్పీటీసీ సభ్యురాలు రమ్యను ఎమ్మెల్యే వ్యతిరేకవర్గమే జడ్పీ డిప్యూటీ చైర్‌పర్సన్‌గా నియమించుకున్నట్లు ప్రచారంలో ఉంది. ఇలా మున్సిపాలిటీ, జడ్పీ పాలకవర్గాల్లో ఎమ్మెల్యే మాట చెల్లలేదు.

మంత్రి, విప్ ఇస్తామని..

రెండోసారి మంత్రివర్గ విస్తరణ జరిగినప్పుడు రాయలసీమలో ఉన్న ఏకైక బలిజ ఎమ్మెల్యే అయిన ఆరణికి మంత్రివర్గంలో చోటు కల్పిస్తామని అధిష్ఠానం హామీనిచ్చింది. చివరికి ఇద్దరు మంత్రులను కొనసాగించి రోజాకూ చోటిచ్చారు. మంత్రివర్గంలో చోటు ఇవ్వలేకపోయామని చెప్పి ప్రభుత్వ విప్ ఇస్తామన్నారు. దానినీ నిలబెట్టుకోలేదు.

'2024లోనే కాదు.. 2029లోనూ నువ్వే

'2024 ఎన్నికల్లోనే కాదు, 2029 ఎన్నికల్లో కూడా నువ్వే వైసీపీ అభ్యర్థివి. నియోజకవర్గాల విభజన జరిగితే మరోచోట నుంచి నీ కొడుక్కి అవకాశం కల్పిస్తా'అని సీఎం జగన్ చెప్పినట్లు ఎమ్మెల్యే ఆరణి పలుమార్లు చెప్పారు. అలాంటిది అస్సలు 2024లోనే టికెట్ ఇవ్వలేదు. సీఎం జగన్ చిత్తూరు వచ్చినప్పుడు, సీఎంవోకు పిలిపించినప్పుడు సీఎం జగన్ స్వయంగా టికెట్ కన్‌ఫర్మ్ చేసినట్లు ఆరణి చెబుతుంటారు. చివరకు ఎమ్మెల్యే.. దీనికి ప్రత్యామ్నాయంగా ఆఫర్ చేసిన రాజ్యసభ టికెట్‌నూ ఇవ్వకుండా అధిష్ఠానం మోసం చేయడంతో ఆయన మనస్తాపం చెందారు.

అధికారులంతా వ్యతిరేకవర్గం వైపే..

జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ, ఆర్డీవో, కమిషనర్ వంటి కీలక అధికారులంతా ఉంటారు. వారంతా తన కంటే విజయానందరెడ్డికే విలువిచ్చి, ఆయన సూచించిన పనుల్నే త్వరగా చేసేవారని ఎమ్మెల్యే నిత్యం ఆరోపిస్తుంటారు. జిల్లా కేంద్రంలో పలు శాఖల్లో అధికారుల నియామకం కూడా విజయానందరెడ్డి చేసుకునేవారని ఎమ్మెల్యే చెప్తారు. గతంలో చిత్తూరు డీఎస్పీగా రెండు పేర్లను ఎమ్మెల్యే సూచిస్తే, వారిని కాదని శ్రీనివాసమూర్తిని నియమించారు. ఇలా అయా ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ఎమ్మెల్యేకు పరపతి తగ్గింది.

నేడు వెయ్యి మందితో జనసేనలో చేరిక

వైసీపీని వీడుతున్నట్లు బుధవారం ప్రకటించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, గురువారం జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించారు. చిత్తూరు మున్సిపాలిటీలోని ఆరుగురు కార్పొరేటర్లు, నియోజకవర్గంలోని నలుగురు సర్పంచులతో పాటు సుమారు వెయ్యి మంది అనుచరులతో కలిసి మంగళగిరిలో పవన్ సమక్షంలో జనసేనలో చేరనున్నారు.

వ్యతిరేకవర్గాన్ని ప్రోత్సహిస్తూ..

ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఉన్న విజయానందరెడ్డితో సమన్వయం చేయని వైసీపీ అధిష్ఠానం.. ఒకరకంగా ఆయన్నే ప్రోత్సహించిందని చెప్పవచ్చు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పదవి ఇచ్చి, కేబినేట్ హోదా కేటాయించింది. ఆ పదవిని రెండోసారి కూడా రెన్యూవల్ చేసింది. దీంతో ఆయన నియోజకవర్గంలోని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రొటోకాల్ మార్గాన్ని అధిష్ఠానం కల్పించింది.

చిత్తూరు ఎంపీ టీడీపీ అభ్యర్థిగా విశ్రాంత ఐఆర్‌ఎస్ ప్రసాద్‌రావు?



చిత్తూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నుంచి చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాద్‌రావును దాదాపుగా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. సివిల్స్ సర్వీసెస్‌లో ఐఆర్‌ఎస్ అధికారిగా ఎంపికై, ఇన్‌కమ్‌ట్యాక్స్ విభాగంలో జాయింట్ కమిషనరుగా పనిచేసిన ప్రసాద్‌రావు 2019లో ముందస్తు పదవీ విరమణ తీసుకున్నారు. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఈయన హైదరాబాద్ పరిసరాల్లో నిర్మాణ రంగ వ్యాపారంలో ఉన్నారు. బాపట్ల ఎంపీ సీటుకోసం ప్రయత్నించిన ఈయనను చిత్తూరుకు చంద్రబాబు ఎంపిక చేశారని తెలుస్తోంది. గత ఎన్నికల అనుభవంతో ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ చిత్తూరు ఎంపీ స్థానాన్ని గెలిచి తీరాలనే పట్టుదలతో టీడీపీ ఉంది. గతంలో కుప్పం, పలమనేరుల్లోని ఆధిక్యతతోనే చిత్తూరు ఎంపీ స్థానాన్ని టీడీపీ సులువుగా గెలుచుకునేది. ప్రస్తుతం చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఆ పార్టీ బలంగా ఉంది. గట్టిగా గెలిచే సీటు కావడంతో పలువురు ఆశించారు. జీడీనెల్లూరు నియోజకవర్గానికి చెందిన, పలువురు ప్రధాన మంత్రుల వద్ద చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేసిన విశ్రాంత ఎస్పీ మునుస్వామి, సినీ నటుడు సప్తగిరి, వేపంజేరి మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ ఇక్కడి నుంచి పోటీచేయడానికి ఉత్సాహం చూపారు. అందుకు ప్రయత్నాలు కూడా చేశారు. అయితే ఆర్థికంగా బలంగా ఉండి, ఉన్నతోద్యోగంలో రిటైరైన మంచి చరిత్ర గల వ్యక్తిని ఎంపిక చేశారని అంటున్నారు.

'హద్దు'లు దాటుతున్న ఇసుక

అక్రమార్కుల బరితెగింపు.. చోద్యం చూస్తున్న అధికారులు



క్రిష్ణజమ్మాపురం నుంచి అడ్డదారుల్లో తమిళనాడుకు తరలుతున్న ఇసుక ట్రాక్టర్



గంగమాంబాపురంలో నిల్వ చేసిన ఇసుక

పాలసముద్రం, మార్చి 6: పాలసముద్రం మండలం నుంచి తమిళనాడుకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. బలిజకండ్రిగ, క్రిష్ణజిమ్మాపురం, సింహరాజుపురం, గంగమాంబాపురం, కోదండరామాపురం, బాలకృష్ణాపురం ప్రాంతాల్లో పగటిపూట ఇసుకను నిల్వచేసి, రాత్రిపూట ట్రాక్టర్లు, టిప్పర్లతో తమిళనాడులోని అత్తిమంజేరిపేట, వంగనూరు, ఆర్కేపేట, అమ్మియార్‌కుప్పం, పొన్నై, షోలింగర్ ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొంతమంది ట్రాక్టర్ యజమానులు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఒక ట్రాక్టర్ ఇసుకను రూ.6వేలు చొప్పున తమిళనాడు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. రెండున్నర ట్రక్కుల ఇసుకను ఒక్కో టిప్పర్‌కు నింపి తమిళనాడుకు తీసుకెళుతున్నారు. నిల్వప్రాంతాల నుంచి రాత్రిపూట టిప్పర్లకు ఇసుకను ఎక్స్‌కవేటర్లతో నింపి తరలిస్తున్నా.. ఇటు పోలీసులు, అటు రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంత మంది వ్యాపారులు గంగాధరనెల్లూరు ఇసుక రీచ్‌లనుంచి టిప్పర్ల ద్వారా ఇసుకను కొనుగోలు చేసి పాలసముద్రం మండలంలో నిల్వ ఉంచి, తమిళనాడుకు తరలిస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. ప్రతిరోజూ సుమారు 20 నుంచి 30 ట్రాక్టర్ల ఇసుకను తమిళనాడుకు తరలిస్తున్నారు. కొంతమంది ట్రాక్టర్ యజమానులు పాలసముద్రం మండలానికి సమీపంలో వున్న తమిళనాడు గ్రామాలకు అడ్డదారుల్లో ట్రాక్టర్ ఇసుక రూ.10 వేలు చొప్పున విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లాకు చేరిన టెన్త్ ప్రశ్నపత్రాలు



ప్రశ్నపత్రాల భద్రతను పర్యవేక్షిస్తున్న డీఆర్వో

చిత్తూరు (సెంట్రల్), మార్చి 6: జిల్లాలో ఈ నెల 18వ తేదీ నుంచి జరగనున్న టెన్త్ పరీక్షలకు సంబంధించి బుధవారం ప్రశ్నపత్రాలు వచ్చాయి. డీఆర్వో పుల్లయ్య సమక్షంలో సీల్ తెరచి వీటిని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. డీఈవో దేవరాజు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ చాముండేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 17,196 మంది హాజరు

బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ మ్యాథ్స్ 1ఎ, బాటనీ1, సివిక్స్ 1కు 17,196 మంది విద్యార్థులు హాజరైనట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. 18,373 మందికిగాను 1,177 విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

ముగిసిన టెట్ : గత నెల 27న ప్రారంభమైన టీచర్ ఎలిజిబులిటీ టెస్టులు (టెట్) బుధవారంతో ముగిశాయి. చివరి రోజున జిల్లాలోని మూడు, చెన్నైలోని ఒక కేంద్రంలో జరిగిన పరీక్షలకు 862 మందికిగాను 783 మంది హాజరుకాగా, 79 మంది గైర్హాజరైనట్లు డీఈవో దేవరాజు తెలిపారు.

కాణిపాకంలో విశాఖ భక్తుడి మృతి

ఐరాల(కాణిపాకం), మార్చి 6: కాణిపాకంలో వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకుని బయటకు వచ్చిన ఒక భక్తుడు గుండెపోటుతో మృతి చెందారు. విశాఖపట్టణానికి చెందిన నాగబాబు(58) బుధవారం ఉదయం 9గంటలకు కుటుంబ సభ్యులతో కలసి వరసిద్ధుడిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసాదాల కొనుగోళ్లకోసం ఆలయం వెనుక వైపున్న లడ్డూ ప్రసాదాల కౌంటర్ వద్దకు చేరుకున్నారు. అక్కడే కుప్పకూలిపోవడంతో నాగబాబును చిగరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

పలమనేరు గోశాల వద్ద అగ్నిప్రమాదం

- రూ.10 లక్షలకు పైగా ఆస్తినష్టం

మంటలను ఆర్పుతున్న సిబ్బంది





పలమనేరు, మార్చి 6: పలమనేరు సమీపంలోని గోశాల వద్ద బుధవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గోశాలలో పశువుల కోసం సాగు చేసిన ఫారం గడ్డి దాదాపు 10 ఎకరాలు కాలిబూడిదైంది. విషయం తెలిసిన వెంటనే పలమనేరు ఫైర్ ఆఫీసర్ పి.మనోహరన్ ఆధ్వర్యంలో ఫైర్‌మెన్ ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే 10 ఎకరాల్లోని గడ్డి కాలిబూడిదైందని, మిగిలిన సుమారు 15 ఎకరాల్లోని గడ్డిని కాలకుండా చూశామని సిబ్బంది తెలిపారు. డ్రిప్ పైపులు కాలిపోవడంతో రూ.10 లక్షల మేరకు ఆస్తినష్టం జరిగినట్లు తెలుస్తోంది.

ఇంటర్ పరీక్ష రాస్తూ స్పృహ కోల్పోయి..

పుంగనూరు రూరల్, మార్చి 6: పుంగనూరులో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్ష రాస్తూ ఓ విద్యార్థిని స్పృహ తప్పారు. పెద్దపంజాణి మండలం గడ్డూరుకు చెందిన అనూషా బసవరాజ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో పరీక్షలు రాస్తూ ఒక్కసారిగా స్పృహ కోల్పోయారు. సూపర్‌వైజర్ గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో కస్టోడియల్ అధికారి రెడ్డెప్ప, సీఐ రాఘవరెడ్డి ఆమెను ప్రభుతాస్పత్రికి తరలించారు. ఆమె స్పృహలోకి రావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశామని వారు తెలిపారు.



చికిత్స పొందుతున్న అనూషా



దశకంఠుడిపై భవుడి విలాసం



ముక్కంటి శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జగద్రక్షకుడైన పరమశివుడు రావణ బ్రహ్మ వాహనంపై కొలువుదీరగా, జ్ఞానప్రసూనాంబ మయూర వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై శ్రీవళ్లి, దేవసేన సమేత కుమార స్వామి, చండీకేశ్వరుడు, భక్తకన్నప్ప కొలువుదీరి ఊరేగారు.ఉదయం ఆలయ అలంకార మండపంలో వేదపండితులు స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో పూజలు చేసి పురవిహారానికి తీసుకువచ్చారు.వాయులింగేశ్వరుడు హంస వాహనంపై, జ్ఞానప్రసూనాంబ యాళి వాహనంపై అధిరోహించి పురవీధుల్లో ఊరేగారు. కోలాటాలు, బ్యాండు వాయిద్యాల సందడి, శివనామస్మరణలతో చతుర్మాడ వీధులు మార్మోగాయి.

- శ్రీకాళహస్తి

తిరుమలేశుడి సేవలో జూనియర్ శ్రీదేవి

దివంగత సినీనటి శ్రీదేవి కుమార్తె, హీరోయిన్ జాన్వీకపూర్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తన పిన్నమ్మ అయిన నటి మహేశ్వరితో కలిసి ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. జాన్వీకపూర్‌కు వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.ఆలయం ముందు జాన్వీకపూర్‌ను చూసేందుకు యాత్రికులు ఉత్సాహం చూపారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి

అవార్డందుకున్న వినుకొండ



ప్రముఖ డోలు విద్వాంసుడు వినుకొండ సుబ్రమణ్యం బుధవారం కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డును అందుకున్నారు.గూడూరు మాళవ్యానగర్‌కు చెందిన ఆయన ఆలిండియా రేడియో టాప్‌గ్రేడ్ ఆర్టిస్టుగా 40 సంవత్సరాలకు పైగా దేశమంతా డోలు కచేరీలు చేశారు. సుబ్రమణ్యం ప్రావీణ్యతను గుర్తించిన కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆయన్ను అవార్డుకు ఎంపిక చేసింది.ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బుధవారం పురస్కారాన్ని స్వీకరించారు.పలువురు కళాకారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

- గూడూరు

ఎంపీడీవోకు, ఏవోకు నోటీసులు

గుడిపాల, మార్చి 6: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ నుంచి గుడిపాల ఎంపీడీవో, ఏవోకు నోటీసులు జారీ అయ్యాయి. గురువారం హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. మండలంలోని పాపిశెట్టిపల్లి కాలనీకి చెందిన నంబిక్‌రాజ్ సమాచార హక్కు చట్టం కింద 2023 సెప్టెంబరు 8న దరఖాస్తు చేసుకున్నారు. నిర్ణీత కాలవ్యవధిలో సమాచారం ఇవ్వకపోవడంతో అప్పిలేట్ అథారిటీకి అప్పీల్ చేసుకున్నారు. అక్కడినుండి సరైన సమాచారం రాకపోవడంతో కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవడంతో వారి నుంచి పౌరసమాచార అధికారి అయిన గుడిపాల ఏవో, అప్పిలేట్ అథారిటీ అధికారి అయినఎంపీడీవోకు నోటీసులు వచ్చాయి.

సజావుగా ఎన్నికలు నిర్వహిస్తాం



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 6: సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టామని, అవసరమైన సిబ్బంది ఏర్పాటు, సెక్టోరల్ అధికారులకు శిక్షణ ఇచ్చామని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్యతో కలసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు.

సమీక్షలు - సమావేశాలు

ఎన్నికలకు సంబంధించి కంట్రోల్ రూమ్‌ను డీఆర్డీఏ మీటింగ్ హాలులో ఏర్పాటు చేస్తామని, పోలింగ్ అనంతరం ఈవీఎంలను భారీ భద్రత నడుమ కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తామన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటినుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి తు.చ. తప్పకుండా పాటించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఆరుగురు సిబ్బంది అవసరమని, వారికి ఎన్నికల శిక్షణ అందిస్తామని చెప్పారు. సమావేశంలో పార్టీల ప్రతినిధులు సురేంద్రకుమార్ (టీడీపీ), ఉదయ్ కుమార్ (వైసీపీ), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), లోకేష్ (కాంగ్రెస్) తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి : ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచారాల కోసం ముద్రించే అన్ని రకాల కరపత్రాల్లో ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు డీఆర్వో పుల్లయ్య సూచించారు. కరపత్రాలు, స్టిక్కర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీల కింద ప్రింటింగ్ ప్రెస్ పేర్లు.. ఎన్ని కాపీలు ముద్రించారనే వివరాలూ ఉండాలన్నారు. ఇతర ప్రాంతాల్లో ప్రింట్ చేసి తరలిస్తే చెక్‌పోస్టుల వద్ద ఒకవేళ తనిఖీల్లో పట్టుబడితే నిబంధనల ప్రకారం అభ్యర్థి ఎన్నికల ఖర్చు కింద వాటిని జమచేస్తామన్నారు. డ్వామా పీడీ రాజశేఖర్, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నారు.

మంత్రి సమావేశానికి హాజరు కాకుంటే చర్యలు!

మహిళా టీచర్లకు పుత్తూరు డీవైఈవో హెచ్చరిక

పుత్తూరు అర్బన్, మార్చి 6: మహిళా దినోత్సవం పేరుతో మంత్రి రోజా నిర్వహించతలపెట్టిన సమావేశానికి మహిళా టీచర్లు హాజరు కాకుంటే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ పుత్తూరు డీవైఈవో హెచ్చరిక జారీ చేశారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం వున్న నేపథ్యంలో మంత్రి రోజా ఒక రోజు ముందుగానే 7వ తేదీన సాయంత్రం 4 గంటలకు పుత్తూరు ఎన్జీవో కాలనీ సమీపంలోని షాదీ మహల్‌లో సమావేశం జరపాలని నిర్ణయించారు. ఎన్నికల నేపథ్యంలో రోజూ ఏదో ఒక వర్గంతో సమావేశమై మద్దతు కోరుతున్న మంత్రి రోజా ఈ సమావేశానికి మహిళా టీచర్లను రప్పించాలని ఆదేశించారో లేదో తెలియదు గానీ పుత్తూరు డీవైఈవో మాత్రం ఎంఈవో 1, ఎంఈవో 2లతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు వాట్సప్ మెసేజీలు పంపించారు. మంత్రి నిర్వహిస్తున్న సమావేశానికి మహిళా టీచర్లు తప్పనిసరిగా హాజరు కావాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని అందులో స్పష్టం చేశారు.మహిళా దినోత్సవం ముందు రోజే నిర్వహిస్తుండడం ఒకటైతే, సాయంత్రం 4 గంటలకు సమావేశానికి రావాలంటే స్కూళ్ళ నుంచీ టీచర్లు పని వేళలు ముగియక ముందే బయల్దేరాల్సి వుంటుంది. నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న ఈ పనులకు మళ్ళీ బెదిరింపులేమిటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.మంగళవారం పుత్తూరులో అంగన్వాడీ కార్యకర్తలతో ఇదే విధంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. దీనికి కూడా మంత్రి రోజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి కూడా ఖచ్చితంగా రావాలని అంగన్వాడీలపై ఒత్తిడి తీసుకురావడం వివాదాస్పదమైంది.అధికార పార్టీ నేతలకు సంబంధించిన కార్యక్రమాలన్నింటికీ బెదిరింపులు, హెచ్చరికలతో ఆయా వర్గాలను హాజరు చేయించడానికి అధికారులు యత్నిస్తున్న తీరు విమర్శలకు దారి తీస్తోంది.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు



చిత్తూరు సిటీ, మార్చి 6: తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్‌కుమార్, చిత్తూరు పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు రాజేష్ ఆధ్వర్యంలో బుధవారం వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరారు. చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 2, 16, 17, 18, 50వ డివిజన్ నుంచి సుమారు 400 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. వీరికి చిత్తూరు అభ్యర్థి గురజాల జగన్మోహన్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్, నేతలు యువరాజ్, గౌతమ్, మౌళి, అశోక్, ఉదయ్, రుద్ర, చిట్టిబాబు, వరుణ్ చౌదరి, నంద, కిరణ్, నవీన్, కిషోర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయండి

- చిత్తూరు రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన ఏజీఎం

చిత్తూరు రూరల్, మార్చి 6: అమృత భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్లను కేంద్ర ప్రభుత్వం ఆధునికీకరిస్తోంది. ఈ క్రమంలో గుంతకల్లు డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఏజీఎం ధనంజయులు బుధవారం పరిశీలించారు. అందులో భాగంగా చిత్తూరు రైల్వేస్టేషన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. త్వరగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపించకూడదని స్పష్టంచేశారు. ఆయన వెంట డివిజన్ స్థాయి అధికారులు, స్టేషన్‌మాస్టర్ ముత్తుస్వామి తదితరులు ఉన్నారు.



రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న గుంతకల్లు ఏజీఎం ధనంజయులు

ఏజీఎం వస్తారని..

తనిఖీ నిమిత్తం ఏజీఎం ధనంజయులు వస్తున్నారని తెలిసి స్థానిక అధికారులు చిత్తూరు రైల్వే స్టేషన్‌ను ముస్తాబు చేశారు. ప్లాట్‌ఫాంను శుభ్రంగా ఉంచారు. కాచిగూడ రైలు ఎక్కాలంటే మూడో ప్లాట్‌ఫాంకి వెళ్లాల్సిందే. దీని కోసం అర కిలోమీటరు దూరం వెళ్లి వంతెన ఎక్కేందుకు భయపడి రైలు ట్రాక్‌ను దాటి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో కొన్ని ప్రమాదాలు జరిగినాఅధికారులు పట్టించుకోలేదు. ఎప్పుడూ మూడో ప్లాట్‌ఫాంలోనే కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌ను ఉంచేవారు. కానీ, బుధవారం మాత్రం ఏజీఎం వస్తున్నారని ఒకటో ప్లాట్‌ఫాంలోకి తెచ్చి ఉంచారు. ఆయన వెళ్లిపోగానే తిరిగి మూడో ప్లాట్‌ఫాంలోకి మార్చారు.

తిరుపతి అసెంబ్లీ సీటు జనసేనకే!

చంద్రబాబు, పవన్ భేటీలో నిర్ణయం ● ఆరణి శ్రీనివాసులు, గంటా నరహరి తదితరుల పేర్లతో సర్వే

● నరసింహ యాదవ్, సుగుణమ్మలకు టీడీపీ అధిష్ఠానం నుంచీ పిలుపు

తిరుపతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గత రెండు నెలలుగా మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన పార్టీల శ్రేణుల్ని తికమకపెడుతూ వచ్చిన తిరుపతి అసెంబ్లీ సీటు కేటాయింపు విషయంలో స్పష్టత వచ్చింది. ఈ స్థానాన్ని మిత్రపక్షమైన జనసేనకు కేటాయించింది తెలుగుదేశం పార్టీ. ఇరు పార్టీల అధినేతలూ బుధవారం జరిపిన భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నిజానికి టీడీపీ, జనసేన పార్టీలు పొత్తు కుదుర్చుకున్నప్పటి నుంచీ తిరుపతి అసెంబ్లీ సీటు జనసేన పార్టీకే కేటాయిస్తారన్న అంచనాలు మొదలయ్యాయి.అయితే అర్థబలం, అంగబలం, అధికార బలాలతో పాతుకుపోయిన ప్రత్యర్థి పార్టీ నేతలను ఎదుర్కొనేందుకు అవసరమైన వనరుల్లో జనసేన నాయకులు వెనుకబడ్డారు. ఆ కారణంగా ఓ దశలో జనసేన తరపున ఉమ్మడి అభ్యర్థి బరిలో వుండరన్న ప్రచారం ప్రారంభమైంది. అయితే చివరికి బుధవారం ఇరు పార్టీల అధినేతలూ జరిపిన సమావేశంలో తిరుపతి సీటును పొత్తులో భాగంగా జనసేనకు ఖరారు చేశారు. అధికార పార్టీ అభ్యర్థిని దీటుగా ఎదుర్కొనేందుకు తగిన వనరులున్న అభ్యర్థిని ఎంపిక చేసే దిశగా జనసేన, టీడీపీ అధినేతలు అన్వేషణ మొదలుపెట్టినట్టు సమాచారం. అందులో భాగంగా దివంగత డీకే ఆదికేశవులుతో బంధుత్వం, పుష్కలంగా అర్థబలం కలిగిన గంటా నరహరి పేరు ప్రధానంగా పరిశీలనలోకి వచ్చినట్టు తెలిసింది. అదే సమయంలో ఇటీవలే జనసేనాని పవన్ కళ్యాణ్‌ను కలసిన చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేరు కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. వీరిద్దరితో పాటు తిరుపతి జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ తదితరుల పేర్లు కూడా కలుపుకుని గురువారం నుంచీ ఐవీఆర్‌ఎస్ సర్వే నిర్వహించనున్నట్టు సమాచారం.

స్థానికులకే టికెట్ ఇవ్వాలని బలిజల డిమాండ్

తిరుపతి సీటు జనసేనకు ఖరారైన నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ టికెట్ స్థానికులకే ఇవ్వాలన్న డిమాండ్ మొదలైంది. నియోజకవర్గంలో ప్రాబల్యం కలిగిన బలిజ సామాజికవర్గంలో పలువురు తిరుపతి టికెట్ స్థానికేతరులకు ఇవ్వరాదని కోరుతున్నారు. గురువారం లేదా శుక్రవారం ఆ సామాజికవర్గానికి చెందిన ముఖ్యులతో సమావేశం నిర్వహించి స్థానికులకే టికెట్‌ఇచ్చేలా తీర్మానంచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయో వేచి చూడాల్సివుంది. ఈ నేపథ్యంలో తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మలకు అధిష్ఠానం నుంచీ పిలుపు వచ్చింది. గురువారం ఉదయం 11 గంటలకు మంగళగిరిలోని పార్టీ కార్యాలయం చేరుకోవాలని బుధవారం సాయంత్రం వారిద్దరికీ పిలుపు వచ్చింది.దీంతో నరసింహయాదవ్ బుధవారంరాత్రే బయల్దేరి వెళ్ళగా సుగుణమ్మ గురువారం ఉదయం వెళుతున్నట్టు సమాచారం. అక్కడ వారు తొలుత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడితో సమావేశం కానున్నారు. తిరుపతి టికెట్ జనసేనకు కేటాయించిన నేపథ్యంలో వారికి అధిష్ఠానం నిర్ణయం గురించి వివరించేందుకు, జనసేన అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరేందుకు పిలిపించినట్టు తెలుస్తోంది. వీరిద్దరూ టికెట్ రేసులో నిలిచిన ప్రధాన ఆశావహులు కావడాన అధిష్ఠానం నిర్ణయం పట్ల వీరి అభిప్రాయం ఎలా వుంటుందో కూడా చూడాల్సి వుంది. అదే సమయంలో ఊకా విజయ్‌కుమార్ పేరు కూడా టీడీపీ టికెట్ రేసులో ప్రముఖంగా వినిపించిన సంగతి తెలిసిందే. ఆయన ఎలా స్పందిస్తారో తెలియడం లేదు. ప్రజారాజ్యం పార్టీలో గతంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఆయనకు చిరంజీవి, పవన్ కళ్యాణ్‌లతో సన్నిహిత సంబంధాలున్న నేపథ్యంలో ఆయన పేరు కూడా జనసేన అధినేత పరిగణనలోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం

గంగాధరనెల్లూరు, మార్చి 6: గతేడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో పాటు మిచాంగ్ తుపానుతో పంట నష్టపోయిన 4,604మంది రైతులకు నష్టపరిహారం కింద రూ.2.78 కోట్లు లబ్ధి చేకూరనుందని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జేసీ శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ మొత్తాన్ని తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం సీఎం జగన్ నగదు జమను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. వ్యవసాయశాఖ జేడీ మురళీక్రిష్ణ, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు వెంకటరెడ్డి, మండల ఆర్‌బీకే అడ్వయిజరీ కమిటీ చైర్మన్ బలరామిరెడ్డి, నగరి, చిత్తూరు వ్యవసాయశాఖ ఏడీలు సౌభాగ్యలక్ష్మి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు ప్రత్యేక రైలు



రైలును పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న కుప్పాల సత్యనారాయణ

తిరుపతి (ఆటోనగర్) మార్చి 6: అయోధ్యను సందర్శించే భక్తుల కోసం తిరుపతి నుంచి బుధవారం ఉదయం ప్రత్యేక రైలు బయలుదేరింది. స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ బీజేపీ నాయకులతో కలిసి పచ్చజెండా ఊపి రైలును ప్రారంభించారు. అయోధ్యలో నిర్మించిన రామ మందిరాన్ని దర్శించుకోవడానికి ఐఆర్‌సీటీసీ దేశ నలుమూలల నుంచి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా తిరుపతి నుంచి అయోధ్యకు 24 కోచ్‌లతో ప్రత్యేక రైలును ఉదయం 7 గంటలకు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం 10.35 గంటలకు అయోధ్యధాంకు చేరుకుంటుందని డైరెక్టర్ తెలిపారు. తిరిగి శనివారం రాత్రి 7.55 గంటలకు అయోధ్యధాంలో బయలుదేరి సోమవారం రాత్రి 11.45 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని తెలిపారు. ప్రారంభోత్సవంలో బీజేపీ నాయకులు జి.భానుప్రకాష్‌రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, చంద్రప్ప, పి.చంద్రశేఖర్, ముని సుబ్రమణ్యం, వి.పద్మ, వేదవతిరాయల్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.91 కోట్లు

తిరుమల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.91 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 64,552 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 19,900 మంది తలనీలాలు సమర్పించారు.

మీడియా ప్రతినిధులపై కేసులు ఎత్తివేయండి

- పెద్దపంజాణి ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలంటూ ఏఎస్పీకి వినతిపత్రం

వి.కోట/ చిత్తూరు, మార్చి 6: వి.కోటలో మీడియా ప్రతినిధులపై పోలీసులు నమోదు చేసిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని ప్రెస్‌క్లబ్ తరపున జిల్లా అదనపు ఎస్పీ ఆరీఫుల్లాను బుధవారం కోరారు. సోమవారం రాత్రి పుష్పపల్లకీ సేవ సందర్భంగా చోటు చేసుకున్న అంశాలను ఆయనకు వివరించారు. కవరేజ్ కోసం వెళ్లిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి విలేకరిని అడ్డుకుని, అతడికి మద్దతు తెలిపిన మరో ముగ్గురు మీడియా ప్రతినిధులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి, తిరిగి తమపైనే కేసులు పెట్టారని వివరించారు. తమ విధులకు పెద్దపంజాణి ఎస్‌ఐ శ్రీనివాసులు ఆటంకం కలిగించి.. తమను దుర్భాషలాడి, తమపైనే కేసులు పెట్టారంటూ ఏఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై విచారించి ఆ ఎస్‌ఐపై కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. తాము సమగ్ర విచారణచేసి ఎస్‌ఐపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హామీ ఇచ్చారు. తమ పై అకారణంగా నమోదైన రెండు కేసులను ఎత్తివేయాల ని జర్నలిస్టులు కోర గా.. ఎస్పీతో సంప్రదిం చి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. వి.కోట ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



చిత్తూరు ఏఎస్పీ ఆరీఫుల్లాకు ఫిర్యాదు ఇస్తున్న జర్నలిస్టులు

మీడియాపై కేసులు సరికాదు: బీజేపీ

ప్రజల పక్షాన నిలిచి నిజాలను నిర్భయంగా రాసే మీడియా ప్రతినిధులపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షైందల రామచంద్రుడు అన్నారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు.

పోలీసులను సస్పెండు చేయాలి

పుంగనూరు: వి.కోటలో మీడియా పట్ల దురుసుగా ప్రవర్తించి, వారిపైనే అక్రమ కేసులునమోదుచేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండపల్లె అక్కులప్ప బుధవారం డిమాండు చేశారు. సమస్య ఏర్పడితే కనీసం పిలిచి మాట్లాడకుండా అక్రమ కేసులు బనాయించేందుకు పోలీసులు తెగబడ్డారంటే ఇక సామాన్య ప్రజల విషయంలో ఎలా ప్రవరిస్తున్నారో అర్థమవుతుందన్నారు. ఈ అక్రమ కేసులను వెనక్కి తీసుకుని.. పెద్దపంజాణి ఎస్‌ఐని సస్పెండు చేయాలన్నారు.

10వరకు చెన్నై సెంట్రల్-తిరుపతి రైళ్ల రద్దు

- 11నుంచి తిరుపతికి బదులుగా తిరుచానూరు నుంచి

పెరంబూర్, మార్చి 6: తిరుపతి సెక్షన్‌లో చేపడుతున్న మరమ్మతుల కారణంగా తిరుపతికి వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేయగా, మరికొన్ని పాక్షికంగా, మరికొన్నింటిని ఇతర మార్గాల్లో నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే పేర్కొంది. ● నెం.06728 తిరుపతి - మూర్ మార్కెట్ కాంప్లెక్స్, నెం.06727 మూర్ మార్కెట్ - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 10వ తేదీ వరకు రద్దు. ● నెం.16854 విల్లుపురం - తిరుపతి ఎక్స్‌ప్రెస్, నెం.16853 తిరుపతి - విల్లుపురం ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 14వ తేదీ వరకు రద్దు ● నెం.06753 అరక్కోణం - తిరుపతి మెమో, నెం.06754 తిరుపతి - అరక్కోణం మెమో రైళ్లు ఈ నెల 10వ తేదీ వరకు రద్దు. ● నెం.17407 తిరుపతి - మన్నార్‌గుడి పమని ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10, 12, 14 తేదీలు, నెం.17408 మన్నార్‌గుడి - తిరుపతి పమని ఎక్స్‌ప్రెస్ ఈనెల 11, 13, 15 తేదీల్లో రద్దు. ● నెం.16112 పుదుచ్చేరి - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్ ఈనెల 12 నుంచి 23 వరకు, నెం.16111 తిరుపతి - పుదుచ్చేరి మెమో ఎక్స్‌ప్రెస్ ఈనెల 11 నుంచి 24వ తేదీ వరకు రద్దు.

తిరుపతికి బదులుగా తిరుచానూరు... : నెం.06753 అరక్కోణం - తిరుపతి మెమో, నెం.06727 మూర్ మార్కెట్ కాంప్లెక్స్ - తిరుపతి మెమో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు తిరుపతికి బదులుగా తిరుచానూరు వరకు మాత్రమే నడుస్తాయి. నెం.06754 తిరుపతి - అరక్కోణం మెమో ఎక్స్‌ప్రెస్, 06728 తిరుపతి - మూర్ మార్కెట్ కాంప్లెక్స్ మెమో ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులుగా తిరుచానూరు నుంచి బయల్దేరుతాయి.

రేణిగుంట వరకే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ : నెం.16057 చెన్నై సెంట్రల్ - తిరుపతి, నెం.16053 చెన్నై సెంట్రల్- తిరుపతి మధ్య నడిచే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 11 నుంచి 23వ తేది వరకు తిరుపతికి బదులుగా రేణిగుంట వరకు మాత్రమే నడుస్తాయి. అలాగే, నెం.16058 తిరుపతి- చెన్నై సెంట్రల్, నెం.16054 తిరుపతి - చెన్నై సెంట్రల్ సప్తగిరి రైళ్లు తిరుపతికి బదులుగా రేణిగుంట నుంచి బయల్దేరుతాయి.

కన్నులపండువగా కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం



పుంగనూరు, మార్చి6: పుంగనూరులో అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. స్థానిక కోనేటి వద్ద గల కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు బాలసుబ్రహ్మణ్యం, రామచంద్రస్వామి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అన్నపూర్ణాదేవి, కాశీవిశ్వేశ్వరస్వాములను ముస్తాబు చేసి వివాహావేదికపై ఏర్పాటు చేశారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తులకు వివరిస్తూ మాంగళ్యధారణ కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే ఆలయంలో హోమాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

9న అగస్త్తీశ్వరస్వామి కల్యాణోత్సవం



పుంగనూరు రూరల్, మార్చి 6: పుంగనూరు మండలం నెక్కొంది కొండపై వెలసిన అగస్త్తీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రికి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు, ఆడికృత్తిక, కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచి వచ్చే భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది. గతంలో నెక్కొంది కొండపై వెళ్లేందుకు రోడ్డు వసతి సరిగా లేకపోగా ప్రస్తుతం కొండపైకి వాహనాలు వెళ్లేలా రోడ్డు, కరెంటు ఏర్పాటు చేశారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానాలు చేయడం అనవాయితీగా వస్తోంది. అగస్త్తీశ్వరస్వామి కొండకు వెళ్లాలంటే పుంగనూరు నుంచి రాయలపేట మార్గంలోని ఏ. కొత్తకోట, అలసాపురం మీదుగా 7 కిలో మీటర్లు, చౌడేపల్లె నుంచి ఏకొత్తకోట మీదుగా 15కిలో మీటర్లు, పలమనేరు నుంచి వీరప్పల్లె మీదుగా, పెద్దపంజాణి నుంచి నేలపల్లె మీదుగా కొండపైకి రోడ్డు మార్గాలు ఉన్నాయి. ఈనెల 8న మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, గజవాహనోత్సవం, నాలుగు యామాల పూజ, 9న సింహ వాహనోత్సవం, రాత్రి 3గంటలకు స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవంచ 10న రథోత్సవం, 11న దీపోత్సవం, 12న నిత్యహోమం, జయాదిహోమం, పూర్ణాహుతి, మధ్యాహ్నం వసంతోత్సవంచ చూర్ణబలి, శూలస్నానం మహాకుంభాభిషేకం, ధ్వజ అవరోహణ, మహామంగళహారతి, 13న శయనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని అర్చకులు రాజన్న దీక్షితులు, సోమశేఖర్‌దీక్షితులు, చంద్రశేఖర్‌దీక్షితులు, ఆలయ ధర్మకర్త రామనారాయణరెడ్డి, నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ కార్యక్రమాలను బలోపేతం చేయాలి



రొంపిచెర్ల పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న చల్లాబాబు

రొంపిచెర్ల, మార్చి 6: టీడీపీ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లి బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్త మీద వుందని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రొంపిచెర్ల పార్టీ కార్యాలయంలో సోమల మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు, బూత్ కమిటీల పాత్ర గురించి చర్చించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్, జయహో బీసీ డిక్లరేషన్ ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు పీఎం.మల్లికార్జున, మహేంద్ర, పెద్దివీరన్నగారి శివశంకర్, మణి, చాణిక్య, అశోక్, గంగాధరం, గణేష్, నౌషాద్‌బాషా పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు వెంటనే అందజేయాలి



పెన్షనర్ల సంఘ సమావేశంలో మాట్లాడుతున్న మనోహరరెడ్డి

పలమనేరు, మార్చి 6 : పెన్షనర్లు వెంటనే తమ లైఫ్ సర్టిఫికెట్లను ఎస్‌టీఓ కార్యాలయంలో అందజేయాలని పలమనేరు పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు మనోహరరెడ్డి విజ్ఞప్తి చేశారు. బుదవారం పలమనేరు పెన్షనర్ల సంఘ భవనంలో జరిగిన పెన్షనర్ల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు పెన్షనర్ల సంఘ భవనంలో రెండు గదులు నిర్మించిన దాతలు మునస్వామి, కుసుమ టీచర్ల కుమార్తె ఉషారాణి 16 వ వర్ధంతి సందర్భంగా రెండు నిముషాల పాటు పెన్షనర్లు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో ప్రధానకార్యదర్శి వెంకటకృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు రత్నారెడ్డి, దవణమణి, విజయకుమార్, సిద్దమనోహర్, వెంకటేసులు, రాజారెడ్డి, నాగభూషణం, గోవిందరాజులు, జయపాల్, కుసుమ కుమారి, సుబ్బన్న, శ్రీనివాసులు, హజీజ్, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న హేమంబర్ గౌడ్

గుడుపల్లె, మార్చి 6: చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని క్లస్టర్ ఇన్‌చార్జి హేమంబర్ గౌడు పేర్కొన్నారు. బుధవారం అగరం పంచాయతీలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో దోచుకోవడం, దాచుకోవడం, ప్రతిపక్షాల నేతలపై దాడులు చేసి కేసులు పెట్టడం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. చంద్రబాబు సీఎం అయిన తనువాత సూపర్ సిక్స్ ప్రవేశపెట్టి ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుస్తారని తెలిపారు. రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీకి ఓటు వేసి చంద్రబాబుకు లక్ష మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి సూపర్ సిక్స్ కరపత్రాలను పంచి పెట్టారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బాబు, సర్పంచ్ గోపాల్, జనసేన మండల అధ్యక్షుడు అమీర్, సుబ్బు, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు చంద్రప్ప, ప్రకాష్, మాజీ సర్పంచ్ వెంకటాచలం, శ్రీరాములు, వెంకటేశు, మంజు, రామచంద్ర, భానుమూర్తి, లక్ష్మీపతి, పురుషోత్తంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా టీడీపీ నేతల ప్రచారం

రామకుప్పం, మార్చి 6: పట్టణంలోని దిగువవీధిలో బుధవారం చంద్రబాబు తరపున టీడీపీ నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి మాట్లాడుతూ వైసీపీ నేతలు చెప్పే కల్లిబొల్లి మాటలు ఎవరూ నమ్మే పరిస్థితి లేరని అన్నారు. వైసీపీ పాలనలో అరాచకాలు, అవినీతి, అక్రమాలకు తప్ప అభివృద్ధికి చోటే లేదన్నారు. కార్యక్రమంలో నేతలు రామకృష్ణప్ప, విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణ, పద్మనాభరెడ్డి, బాలరాజు, సుబ్రి, జ్ఞానశేఖర్‌రెడ్డి, సతీష్, ఆదిల్, మంజునాథ్, అవినాశ్, పద్మమ్మ, అమర్‌నాథ్, శంకర్, శ్రీకాంత్, బొరుగులశీన, చలపతి, భాస్కర్, సురేష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఉస్సిగానిపల్లె పంచాయతీ జొూకుపల్లె చైడేశ్వరమ్మ ఆలయంలో టీడీపీ నేతలు రామ్మూర్తి జయశంకర్, సుభాస్, శంకర్‌చలం, మణేష్, జనసేన నేతలు పళిని, రఘు చంద్రబాబు పేరిట పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటా ప్రచారం చేసి చంద్రబాబుకు భారీ మెజారిటీ అందించాలని కోరారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ వైద్యశిబిరం

కుప్పం, మార్చి 6: కుప్పం పట్టణంలోని పూలమార్కెట్ వద్ద బుధవారం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 130 మందిని పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మధు, ఝాన్సీరాణి, పార్థసారథి, గణేశ్, మనికంఠలు వైద్య సేవలు అందించారు.

కంపెనీలకు పొగబెట్టి సాగనంపుతున్న జగన్ ప్రభుత్వం

మాజీ మంత్రి అమరనాథ రెడ్డి

గంగవరం, మార్చి 6 : రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వమే, ఉన్న కంపెనీలకు పొగబెట్టి పక్క రాష్ట్రాలకు సాగనంపుతున్న దుర్మార్గపు ప్రభుత్వం మనకు ఉండడం సిగ్గుచేటని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి విరుచుకుపడ్డారు. బుధవారం గంగవరంలోని ఓ ప్రైవేటు హాల్‌లో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి అమరనాథరెడ్డి హాజరై ప్రసంగించారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన కియా లాంటి సంస్థను మన రాష్ట్రానికి తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదే అని అన్నారు. గంగవరం మండలం నాలుగురోడ్ల సర్కిల్ వద్ద ఇండస్ట్రియల్ హబ్‌ను ఏర్పాటు చేసి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు స్థలాలు కేటాయించి, సబ్సిడీ రుణాలందించిన ఘనత కూడా టీడీపీ ప్రభుత్వందేనన్నారు. ఈ దుర్మార్గపు ప్రభుత్వాన్ని సాగనంపడానికి తెలుగుయువత, జనసేన నాయకులు కలసికట్టుగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళి, నదీమ్, గిరిధర్‌గోపాల్, మంజునాథ రెడ్డి, మురళి పాల్గొన్నారు.

తెలుగుదేశం హయాంలోనే బీసీల అభివృద్ధి

పలమనేరు : తెలుగుదేశం పార్టీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ జగన్ పాలనలో 300 మందికి పైగా బీసీలు హత్యకు గురయ్యారన్నారు. వైసీపీ ప్రభుత్వం రూ.75 వేల కోట్లు బీసీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించిందని, అధికారంలోకి వచ్చాక బీసీ సబ్‌ప్లాన్ నిధులు బీసీలకోసమే వినియోగించేలా చర్యలు తీసుకొంటామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌ను వైసీపీ ప్రభుత్వం 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి 16800 పదవులను బీసీలకు దూరం చేశారన్నారు. అధికారంలోకి వచ్చాక బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న మాజీమంత్రి అమరనాథ రెడ్డి

స్మగ్లర్ వీరప్పన్ స్థూప ఆవిష్కరణ సబబేనా?

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, మార్చి 6 : బాధ్యత గల పదవిలో ఉండి గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ స్థూపాన్ని ఆవిష్కరించడం సబబేనా అని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఎమ్మెల్సీ భరత్‌ను ప్రశ్నించారు. బుధవారం మండల పార్టీ కార్యాలయంలో మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ్‌నాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, ఇతర టీడీపీ నేతలతో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. 64 పెద్దూరు, సి.బండపల్లె పంచాయతీ పరిధిలోని అటవీ భూములోని గ్రానైట్‌ను మంత్రి పెద్దిరెడ్డి, కుప్పం వైసీపీ నాయకులు కొల్లగొట్టారని, అందుకు అధికారులు కూడా సహకరించారని ఆరోపించారు. అలాంటి వారు స్మగ్లర్ వీరప్పన్ స్తూపాన్ని ఎమ్మెల్సీ ఆవిష్కరించారంటే మీ ఉద్దేశం ఏమింటో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. వైసీపీలో స్మగ్లర్లు, దోపిడీదారులు, దొంగలు, అక్రమార్కులను ప్రోత్సహించినట్లేనని ఆరోపించారు. చంద్రబాబు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసినా ఎప్పుడూ ఇలాంటి స్మగ్లింగ్, దౌర్జన్యాలు, పోరుబాట్లు చేయమని ప్రోత్సహించిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పీవీ నాగరాజు, చంద్రశేఖర్, పెద్దన్న, అనుసూయ, మురళి, మణి, విజయకుమార్, ఏఎంసీ నాగరాజు, శేఖర్, రమేష్, ఎస్ శ్రీనివాసులు, రమేష్, విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, ఆంజనేయరెడ్డి, బాలు, రమేష్‌రెడ్డి, జయరామిరెడ్డి, నారాయణస్వామి, భాస్కర్, రుద్రప్ప, ప్రకాష్, పెద్దన్న, మునిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం శాంతిపురం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. గౌనివారి శ్రీనివాసులు మట్లాడుతూ రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీని ఆదరించాలన్నారు.

లక్ష మెజారిటీయే లక్ష్యంగా ఓట్లేయాలి : టీడీపీ

కుప్పం/కుప్పం రూరల్, మార్చి 6: చంద్రబాబుకు లక్ష మెజారిటీయే లక్ష్యంగా ఓట్లేసి ఘన విజయం కట్టబెట్టాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. కుప్పం పట్టణం కొత్తపేటలోని వినాయకస్వామి ఆలయంలో బుధవారం పూజలు చేసి వారు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కొత్తపేటలో పర్యటించి సూపర్ సిక్స్ పథకాల గురించి, తద్వారా ప్రజలకు చేకూరబోయే లబ్ధి గురించి వివరించారు. కరపత్రాలు పంచి పెట్టారు. ఇంటింటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఆయా సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ కొత్తపేట ఇన్‌ఛార్జి అప్పు ముఖేశ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కన్నన్, జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు నరేశ్, టీడీపీ నాయకులు గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, లోకేశ్, వరదరాజులు, అన్వర్, ఎన్‌కే.మణి, ఉదయ్, ఆర్‌ఆర్.రవి, వెంకటేశ్, గోవిందరాజులు, సుజిత్, వేలు, జయమ్మ, తిరుమగల్, మంజునాథ్, వేణు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కుప్పం కొత్తపేటలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

వాల్మీకి విగ్రహానికి రూ.లక్ష విరాళం

కుప్పం మండలం కంగుంది కోట సమీపంలో బుధవారం టీడీపీ ఎన్నికల ప్రచార సభ జరిగింది. కంగుంది కోట వద్ద వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపనకోసం చంద్రబాబు తరపున రూ. లక్ష విరాళాన్ని ఎమ్మెల్సీ శ్రీకాంత్, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌లు వాల్మీకి పెద్దలకు అందజేశారు.

బాబుతోనే బీసీల అభ్యున్నతి సాధ్యం : ఎమ్మెల్సీ కంచర్ల

గుడుపల్లె, మార్చి 6: చంద్రబాబు సీఎం అయితేనే బీసీల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం బెగ్గిలపల్లెలో వక్కలిగర సంఘం ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీల అభ్యున్నతి కోసం కార్పొరేషన్‌లు పేరుకు మాత్రమే ఏర్పాటు చేసారని, వారికి చేసింది ఏమిలేదన్నారు. వక్కలిగర సంఘం నాయకుడు హేమంబర్ గౌడు మాట్లాడుతూ...టీడీపీ ప్రభుత్వ హయంలో బీసీల కోసం కార్పొరేషన్ రుణాలు, ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందించి వారి ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటు అందించిందన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి ఒక్క చంద్రబాబు సీఎం అయితే సాధ్యమన్నారు. పలువురు వక్కలిగర కులస్తులు టీడీపీలో చేరగా వారికి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాజీ గౌనివారి శ్రీనివాసులు, డాక్టర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



వక్కలిగర కులస్తులకు పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

వికలాంగుల మహాగర్జన కరపత్రిక ఆవిష్కరణ



సోమల, మార్చి 6: ఈనెల 9వ తేదీన గుంటూరులో నిర్వహించే వికలాంగుల మహా సింహ గర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మురళీ పిలుపునిచ్చారు. ఈక్రమంలోనే మంగళవారం సోమల బస్టాండ్‌లో కరపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభకు వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. రాష్ట్రంలోని వికలాంగులందరూ పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ప్రకాశ్, ప్రభుకుమార్, శుభకర్, వెంకటరామయ్య, లక్ష్మీదేవమ్మ, రమణ, మణి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి దూసుకొచ్చిన కారు
యువకుడికి తీవ్ర గాయాలు



గుడుపల్లె, మార్చి 6: మద్యం మత్తులో ఓ వ్యక్తి కారు నడిపి జనావాసాల్లోకి దూసుకెళ్లగా ఓ యువకుడికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం గుడుపల్లె మండలంలో చోటుచేసుకొంది. పోలీసు కథనం మేరకు...వి.కోటకు చెందిన రహిమతుల్లా బెంగళూరులో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడి బంధువులు కుప్పం పీఈఎస్ మెడికల్ కాలేజి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని పరామర్శించడానికి రహిమతుల్లా బెంగళూరు నుంచి మద్యం మత్తులో కారు నడుపుకుని వస్తున్నాడు. ఈ క్రమంలో కుప్పం-పలమనేరు మార్గం శెట్టిపల్లె సమీపంలో ఉన్న మనోహర్ ఇంటిపైకి రహిమతుల్లా కారు వేగంగా దూసుకెళ్లడంతో ఇంటి ఎదుట ఉన్న ట్రాక్టర్ ధ్వంసం కాగా, పక్కనే తన బైక్‌పై ఉన్న జయపాల్(28) ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గాయపడ్డ జయపాల్‌ను పీఈఎస్ మెడికల్ కాలేజి ఆసుపత్రి తరలించారు. జయపాల్ పరిస్థితి విషయంగా ఉందని వైద్యులు తెలిపారు. గుడుపల్లె పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుంగనూరు బీజేపీ అసెంబ్లీ టికెట్ కోసం దరఖాస్తు

పుంగనూరు, మార్చి 6: రాబోయే ఎన్నికల్లో పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని పార్టీ అధిష్ఠానానికి దరఖాస్తు చేసినట్లు పుంగనూరుకు చెందిన బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు అయూబ్‌ఖాన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు ఒకస్థానం ఇవ్వాలని, అందులో తనకు పుంగనూరు సీటు కేటాయించాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరీని కోరినట్లు చెప్పారు.

నేటి నుంచి భోగనంజుండేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాలు

పుంగనూరు రూరల్, మార్చి 6: పుంగనూరు బస్టాండ్‌లో వెలసిన భోగనంజుండేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభంకానున్నట్లు ఆలయ ఈవో కమలాకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం గంగపూజ, గణపతిపూజ, కలశపూజ, అంకురార్పణం, ధ్వజారోహణం, నవగ్రహారాధన, అభిషేకం, నిత్యహోమం, నిత్యబలి, మహామంగళహారతి, 8న రుద్రాభిషేకం, లింగోద్భవ అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), మార్చి 6: కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తిరుపతికి చెందిన ధర్మయ్యగారిరాజారెడ్డి రూ.2,00,000, గో సంరక్షణ ట్రస్టుకు రూ.1,00,000 బుధవారం విరాళంగా అందించారు. విరాళదాతను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

చౌడేపల్లె, మార్చి6: టీడీపీతోనే బీసీల అభివృద్ధి అని చౌడేపల్లెకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు పార్థసారధి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు మంగళవారం మంగళగిరిలో జరిగిన సమావేశంలో బీసీలకు సముచిత స్థానం కల్పించడం హర్షణీయమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై దాడులు అధికంగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టి సబ్‌ప్లాన్ ద్వారా ఆర్థిక అభివృద్ధి, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వటం అభినందనీయం అన్నారు. తం రిజర్వేషన్లు ఇవ్వడం అభినందనీయం అన్నారు.

ఆరో తరగతికి దరఖాస్తుల స్వీకరణ

రొంపిచెర్ల, మార్చి 6: రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈనెల 3వ తేది నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సరళ కోరారు. తెలుగు, ఇంగ్లీషు మీడియంలో ఏప్రిల్ 21న ప్రవేశపరీక్ష నిర్వహిస్తారన్నారు. వివరాలకు ఎంఈవో, ప్రిన్సిపాల్‌తో సంప్రదించాలన్నారు.

నేడు రొంపిచెర్ల సంత వేలం పాటలు

రొంపిచెర్ల,మార్చి6: రొంపిచెర్ల వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్‌కు సంబంధించిన వేలం పాటలు గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ఈవో నాగరాజ తెలిపారు. వారపు సంతకు రూ2లక్షలు, దినసరి మార్కెట్, ప్రైవేట్ బస్టాండు ఒక్కొక్కదానికి రూ80 వేలు డిపాజిట్ ముందుగా చెల్లించి వేలంపాటలో పాల్గొనాల్సి ఉందన్నారు.

మహాశివరాత్రికి 20 బస్సుల ఏర్పాటు

కుప్పం, మార్చి 6: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మల్లప్పకొండపై వెలసిన మల్లేశ్వరస్వామివారికి వైభవంగా ఉత్సవం జరుగుతుంది. భక్తుల సౌకర్యార్థం ఆ రోజున మల్లప్పకొండకు కుప్పం డిపోనుంచి 20 బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు పెంచలయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

దుర్గం కొండకు ఆర్టీసీ బస్సులు

సోమల, మార్చి 6: దుర్గంకొండలో కొలువుతీరిన గార్గేయ మునీశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా చేపట్టారు. ఈ నేపథ్యంలోనే సోమల-దుర్గం కొండకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు పుంగనూరు డీఎం సుధాకరయ్య తెలిపారు. ప్రతి అర గంటకు బస్సులను కొండకు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు కరీంముల్లా, శంకరయ్య తదితరులతో ఆయన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీడీపీ కుటుంబానికి ఆర్థిక సాయం

శాంతిపురం, మార్చి6:ఎంకేపురం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన వరదమ్మ కుటుంబానికి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్‌నాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, ఇతర టీడీపీ నేతలు బుధవారం వరదమ్మ మృతదేహానికి అంజలి ఘటించి నివాళర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

బోయకొండలో వేలం పాటల వాయిదా

చౌడేపల్లె, మార్చి6: బోయకొండలో వివిధ వ్యాపారాలు చేసుకునే హక్కు కోసం నిర్వహించాల్సిన వేలం పాటలు ఈనెల 18కి వాయిదా పడినట్లు ఆలయ చైర్మన్ నాగరాజ రెడ్డి, ఈవో చంద్రమౌళి పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భారతి, రాజేష్, రామదాస్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.

ఆది దంపతుల కల్యాణోత్సవం



సదుం, మార్చి 6: స్థానిక గార్గేయ నది ఒడ్డున వెలసిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. తొలుత ఆలయ ప్రాంగణంలోని మరకత శివలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజాభిషేకాల అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణలతో కల్యాణోత్సవం నిర్వహించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

సోమల, మార్చి 6: టెన్త్ విద్యార్థులు ఇష్టపడి చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో శివరత్న అన్నారు. బుధవారం స్థానిక హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిళ్లకు గురికాకుండా మానసిక ధైర్యాన్ని నింపాలన్నారు. వెనుక పడిన విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. నాగరాజ, విద్యా కమిటి అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జ్యోతీశ్వరుడు, కరుణానిధి, మమత, అరుణ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

రామకుప్పం, మార్చి 6: రామకుప్పం మండలం కోట్లగూరుకు చెందిన అశోక్‌రెడ్డి అనారోగ్యం పాలై వివిధ ఆసుపత్రుల్లో వైద్యచికిత్సలు పొంది కోలుకున్నాడు. చికిత్సల కోసం అప్పులు చేసిన ఆయన ప్రభుత్వ సాయం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అతని ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా రూ.1.50లక్షలు ఆర్థికసాయం మంజూరు చేసింది. బుధవారం ఎమ్మెల్సీ భరత్ భార్య దుర్గ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, వైసీపీ మండల కన్వీనర్ విజలాపురంబాబుతో కలసి అశోక్‌రెడ్డికి చెక్ అందజేశారు.

పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు

చౌడేపల్లె, మార్చి6: పదోతరగతి పరీక్షలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఎస్ఎస్‌సీ సిమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన చౌడేపల్లె హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ..ఈనెల 18 నుంచి జరుగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులకు తాగునీరు, గాలి, వెలుతురు అందేలా, ఫస్ట్‌ఎయిడ్ తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అలాగే నాడు-నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, సీఆర్పీ రఘు, ఉపాధ్యాయులు మురళి, ఈశ్వర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వంద పడకల ఆసుపత్రి భవనం ప్రారంభం

పలమనేరు, మార్చి6 : పలమనేరులో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభిస్తారని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో సుమారు 1900 మంది లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలు కూడా పంపిణీ చేస్తారని తెలిపారు.

కోడిపందెం స్థావరంపై దాడి

రామకుప్పం, మార్చి 6: మణీంద్రం పంచాయతీ కృష్ణరాజపురం సమీపంలో కోడిపందెం శిబిరంపై పోలీసులు దాడులు చేశారు. కృష్ణరాజపురం సమీపంలోని మామిడి తోటలో కోడి పందెం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సాయంత్రం 4గంటలకు తమ సిబ్బందితో అక్కడకు వెళ్లి మెరుపుదాడి నిర్వహించినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. ఈ దాడిలో 7మోటారుసైకిళ్ళు, 6 కోళ్ళు, 3 చనిపోయిన కోళ్ళను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆరుగురు పందెంరాయుళ్ళను అరెస్టు చేసి రూ.6640 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

భీమగానిపల్లె వద్ద అగ్నిప్రమాదం

పుంగనూరు రూరల్, మార్చి 6: భీమగానిపల్లె సమీపంలోని కృష్ణప్పకు చెందిన తోటలో చెట్లు దగ్ధమై రూ.లక్ష మేరకు నష్టం వాటిల్లినట్లు పుంగ నూరు అగ్నిమాపకాధికారి ఎస్. సుబ్బరాజు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ధూమపానం సేవించి ఆర్పకుండా తోటలోకి పడేయడంతో ప్రమాదం జరిగి ఉంటుందని ఆయన తెలిపారు. మంటలకు నీలగిరితోట, కందిపంట, జొన్నపంటలు కాలిపోయినట్లు చెప్పారు. అలాగే పుంగనూరులోని చౌడేపల్లె రోడ్డులో పి.ప్రభుకు చెందిన మామిడితోటకు మంటలు రావడంతో తమసిబ్బంది వెళ్లి అదుపు చేశారన్నారు.

మహానందీశ్వరుడికి పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు

ఐరాల(కాణిపాకం), మార్చి 6: నంద్యాల జిల్లా మహానందిలో వెలసిన మహానందీశ్వరుడి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు బుధవారం పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రతి ఏటా మహానందీశ్వరుడి బ్రహ్మోత్సవాలకు వరసిద్ధుడి తరపున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం చైర్మన్, ఈవో, సిబ్బందిని మహానంది ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, ఏఈవోలు మధు, వెంకటేశ్వర్లు, కాణిపాకం ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్, అర్చక, వేద పండితులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), మార్చి 6: కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తిరుపతికి చెందిన ధర్మయ్యగారిరాజారెడ్డి రూ.2,00,000, గో సంరక్షణ ట్రస్టుకు రూ.1,00,000 బుధవారం విరాళంగా అందించారు. విరాళదాతను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ప్రకృతి సంపద దోపిడీ


భానుప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ వర్గీయులు

విజయపురం, మార్చి 6: మండలంలో వైసీపీ పాలనలో ప్రకృతి సంపద కూడా దోపిడీకి గురైందని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ విమర్శించారు. బుధవారం మండలంలోని విజయపురం హరిజనవాడ, ఆది ఆంధ్రవాడ, ముత్యాలరెడ్డి కండ్రిగ, మంగళం, గాండ్లకండ్రిగ, చెంగమనాయుడు కండ్రిగ గ్రామాల్లో బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వర్గీయ గాలి ముద్దుకృష్ణమ నాయుడు మండలంలో ప్రకృతి సంపదను కాపాడటం కోసం పోరాటం చేస్తే ప్రస్తుత మంత్రి రోజా కొండలు, గుట్టలు అక్రమంగా తవ్వి కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. తనను ఎమ్మెల్యేగా ఆదరిస్తే విజయపురాన్ని పారిశ్రామిక కేంద్రంగా చేస్తానని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. విజయపురం దళితవాడ నుంచి వైసీపీకి చెందిన 20 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు రమేశ్ రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, మునిభాస్కర్‌రాజు, కపిల్, అశోక్, జాన్, కొండూరు దామోదర్‌రాజు, హరికృష్ణ, నారాయణరాజు, శ్యాం, గాలి రమేశ్, బెంజిమన్, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా: థామస్


కరపత్రాలు ఇస్తున్న థామస్

పెనుమూరు, మార్చి 6: తెలుగు దేశం పార్టీ జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను ఆశీర్వదించండి... నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని డాక్టర్ థామస్ కోరారు. బుధవారం ఆయన మండలంలోని కేసీ పల్లి సెగ్మెంట్‌లో బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆయన సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు, నాయకులు మనోహర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, పంగుళూరి కిషోర్, తలారి రెడ్డెప్ప, సురేష్ నాయుడు, అశోక్, తులసి నాయుడు, విక్రమ్, పూలశేఖర్, గుర్రప్ప నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలపై అవగాహన


స్వాగతం పలుకుతున్న మహిళలు

యాదమరి, మార్చి 6: టీడీపీ, జనసేన ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలపై పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జీ మురళీ మోహన్ ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని జంగాలపల్లెలో ఆయన ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. వైసీపీ ఎంపీపీ సురేష్ సొంత గ్రామంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. మురళీమోహన్ మాట్లాడుతూ జంగాలపల్లె గ్రామస్తులు తనపై ఎనలేని అభిమానం చూపారని, గెలిచిన తరువాత ఈ గ్రామాన్ని దత్తత తీసుకుంటానని హామి ఇచ్చారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మండల అధ్యక్షులు మురార్జీ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ రవి, బంగారుపాళ్యం మండల టీడీపీ అధ్యక్షులు జయప్రకాష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జయచంద్ర నాయుడు, నేతలు తులసీప్రసాద్, అమరనాథ నాయుడు, చిత్రమ్మ, సుభాష్ నాయుడు, రామదాస్ తదితరులు పాల్గొన్నారు.

నా మొదటి ఓటు దేశం కోసం



ఓటుపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ జీవనజ్యోతి

చిత్తూరు (సెంట్రల్), మార్చి 6: యువతకు తొలిసారి లభించిన ఓటు హక్కును దేశం కోసం సద్వినియోగం చేసుకోవాలని పీవీకేఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, దానిని ఉపయోగించుకోవడం మన కర్తవ్యమని గుర్తు చేశారు. తాము ఓటు వేస్తామంటూ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఓటు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు

వెదురుకుప్పం, మార్చి 6: ఓటు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద తెలిపారు. బుధవారం వెదురుకుప్పంలో ఓటు హక్కుపై ఓటర్లకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

చంద్రబాబు, లోకేశ్‌ను కలసిన మాజీ మేయర్


చంద్రబాబును కలసిన మాజీ మేయర్ కటారి హేమలత

చిత్తూరు సిటీ, మార్చి 6: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లను మాజీ మేయర్ కటారి హేమలత బుధవారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఎన్నికల్లో కష్టపడి పనిచేసి పార్టీ విజయానికి సహకరించాలని, కటారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారని ఆమె తెలిపారు. భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారని ఆమె పేర్కొన్నారు.

10లీటర్ల సారా సహా విక్రేత అరెస్టు


సారా సహా విక్రేతను చూపిస్తున్న పోలీసులు

వెదురుకుప్పం, మార్చి 6: సారా సహా విక్రేతను అరెస్టు చేసి, రిమాండుకు తరలించామని వెదురుకుప్పం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. వెదురుకుప్పం మండలం వేణుగోపాలపురానికి చెందిన జయచంద్ర భార్య జ్యోతమ్మ (45) నాటు సారా తయారీ చేసి, విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తన ఇంటి వద్ద విక్రయిస్తుండగా 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. జ్యోతమ్మను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

పీసీసీ అధికార ప్రతినిధిగా ప్రభాకర్


షర్మిలకు కృతజ్ఞతలు తెలుపుతున్న పూతలపట్టు ప్రభాకర్

పూతలపట్టు, మార్చి 6: పీసీసీ అధికార ప్రతినిధిగా పూతలపట్టు ప్రభాకర్‌ను ఆ పార్టీ అధ్యక్షురాలు షర్మిల బుధవారం నియమించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికోసం అహర్నిశలు కృషిచేస్తానని, తనకు పదవి రావడానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

యాదమరి, మార్చి 6: మండలంలోని దాసరపల్లిలో వెలిసిన శ్రీరంగనాథస్వామి ఆలయంలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామపెద్దలు హేమగిరి (చిట్టి), పాండు నాయుడు, సీతారాముడు, దేవేంద్ర కుమార్, తోట శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, గురుమూర్తి, గుణశేఖర్, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పేదలకు అన్నదానం

బంగారుపాళ్యం, మార్చి 6: మండల కేంద్రంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద అన్నక్యాంటీన్‌లో బుధవారం మండల వాణిజ్య విభాగ అధ్యక్షుడు వంశీ చౌదరి జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, మాజీ ఏఎంసీ చైర్మన్ జయచంద్ర నాయుడు, హేమచంద్ర నాయుడు, జనార్దన్ గౌడ్, రమేష్, రాజేంద్ర నాయుడు, గిరిబాబు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టులో...

పూతలపట్టు, మార్చి 6: స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో వున్న అన్నక్యాంటీన్‌లో బుధవారం పూతలపట్టుకు చెందిన కుప్పస్వామి పిళ్ళై, ఎంకే ధనలక్ష్మి కుటుంబసభ్యులు భోజనం వితరణ చేశారు. నాయకులు వేణుగోపాల్ నాయుడు, భాస్కర్, ఏకాంబరం, నాగయ్య, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

చిత్తూరు కల్చరల్, మార్చి 6: గిరింపేట సత్యసాయి సంస్థాన్ ఆధ్వర్యంలో జైహింద్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సత్యసాయి నగర కన్వీనర్ ఆర్. శేషనారాయణ, రెడ్ క్రాస్ ప్రతినిధి ఆర్. సహదేవ నాయుడు, గజేంద్రరెడ్డి, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టాలి

శ్రీరంగరాజపురం, మార్చి 6: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సరఫరాపై అధికారులు దృష్టి పెట్టాలని జడ్పీ సీఈవో గ్లోరియా అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో కృష్ణయ్య, జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, జనార్ధన్, హరిరెడ్డి, సిబ్బంది బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ టీడీపీ క్రిస్టియన్ సెల్‌లో మరో ముగ్గురికి చోటు

గంగాధరనెల్లూరు, మార్చి 6: పార్లమెంట్ టీడీపీ క్రిస్టియన్ సెల్ విభాగంలో గంగాధరనెల్లూరు మండలానికి చెందిన మరో ముగ్గురు నేతలకు చోటు లభించింది. పార్లమెంట్ టీడీపీ క్రిస్టియన్ సెల్ ఉపాధ్యక్షుడిగా వేల్కూరు పాత దళితవాడకు చెందిన ఎం.జాన్ (జాన్ ఇమ్మానుయేల్), సెక్రటరీగా ముక్కళత్తూరు పంచాయతీ మిట్ట దళితవాడకు చెందిన ఇమ్మానుయేల్ (చిన్నా), అధికార ప్రతినిధిగా తూగుండ్రం దళితవాడకు చెందిన బి.శాంతకుమార్‌ను నియమించినట్లు జిల్లా టీడీపీ అధ్యక్షులు పులివర్తి నాని, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్‌లు ఉత్తర్వులు జారీచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఈ పదవులకు ఎంపిక చేసినందుకుగాను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్, మండల, నియోజకవర్గ, పార్లమెంట్ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పని కల్పించండి

పాలసముద్రం, మార్చి 6: మండలంలో ఉపాధి హామి పథకంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి పనులు కల్పించాలని ఏపీవో మార్గరెట్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వేసవి కాలం దృష్ట్యా కూలీలు వలస వెళ్లకుండా ఆయా పంచాయతీల్లోనే ఉపాధిహామి పథకం కింద పనులు కల్పించాలన్నారు. చెరువుకాలువలు, కొండల నుంచి చెరువులకు వచ్చే సప్లై ఛానళ్ల పనులు చేయించాలన్నారు. ఈసీ అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ కోసం రంగంలోకి పోలీసులు

● ఎక్కడికక్కడ టీడీపీకి అడ్డంకులు ● సూపర్ సిక్స్ ప్రోగ్రామ్ చేసేవారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ● వన్ టౌన్ స్టేషన్‌ను చుట్టుముట్టిన టీడీపీ శ్రేణులు


వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వస్తున్న టీడీపీ నాయకులు

చిత్తూరు, మార్చి 6: చిత్తూరు నియోజకవర్గంలో టీడీపీ పుంజుకుంటున్న కొద్దీ వైసీపీ ఆందోళన చెందుతోంది. దీంతో ఎప్పటికప్పుడు టీడీపీ కార్యక్రమాలను అడ్డుకునేందుకు పోలీసులను రంగంలోకి దింపుతోంది. ఇప్పటికే పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలుండగా, బుధవారం నాటి పరిణామాలు దీనికి బలం చేకూరుస్తున్నాయి. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని సత్యనారాయణపురంలో బుధవారం టీడీపీ శ్రేణులు సూపర్ సిక్స్ పేరుతో ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ, కుటుంబ సభ్యులకు ఇష్టమైతే వారి సెల్‌ఫోన్ నుంచి టీడీపీ నెంబరుకు మిస్ట్ కాల్ ఇస్తున్నారు. ఓటీపీ నెంబరును నమోదు చేసుకుంటున్నారు. దీంతో జీర్ణించుకోలేని వైసీపీ వెంటనే పోలీసులను రంగంలోకి దింపింది. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ప్రచారం చేస్తున్న ముగ్గురిని స్టేషన్‌కు రావాలని పిలిచారు. దీంతో మరో నలుగురు టీడీపీ నాయకులు అక్కడికి చేరుకుని పోలీసులను ప్రశ్నించారు. అయినా వినకుండా చిత్తూరు వన్ టౌన్ పోలీసులు ప్రచారం చేస్తున్న ముగ్గురితో పాటు అక్కడికి వచ్చిన నలుగురిని కూడా బుధవారం ఉదయం 11 గంటలకు అదుపులోకి తీసుకున్నారు. వారిలో శేషాద్రి నాయుడు, బాలాజీ, ప్రభుతేజ, కృష్ణమూర్తి, కనకరాజులు, సాయికుమార్, యువరాజులు నాయుడు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, కాజూరు బాలాజీ తదితరులు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని చిత్తూరులోనే అడ్డుకోవడం దారుణమని సీఐ విశ్వనాథరెడ్డిని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు స్టేషన్‌కు వచ్చారని తెలుసుకున్న వైసీపీ నాయకులు ఏడుగురి మీద రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారించేందుకు మాత్రమే స్టేషన్‌కు పిలిచామని సీఐ సమాధానమిచ్చారు. ఈ సర్వే లాంటి ప్రచారం గురించి జేసీ దృష్టికి తీసుకెళ్లి, ఈసీ నిబంధనల మేరకు క్లారిటీ తీసుకుని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆ ఏడుగురికి 151 నోటీసులను అందించి సాయంత్రం పంపించేశారు. టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ స్టేషన్ ఎదుట మీడియాతో మాట్లాడుతున్న సమయంలో అక్కడికి వైసీపీ ప్రచార రథం చేరుకుంది. భారీ శబ్దాలతో పాటలు పెట్టి అక్కడ పెద్దఎత్తున హాజరైన టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించింది. గురజాల జగన్మోహన్ మీడియాతో మాట్లాడకుండా శబ్దాలతో ఆ ప్రచారం రథం ఇబ్బంది పెట్టింది. పోలీసులు కూడా ఆ రథాన్ని అక్కడి నుంచి పంపించలేదు. కనీసం సౌండ్‌ను కూడా తగ్గించలేకపోయారు.

నేను స్మగ్లర్‌ను కాదు.. కష్టపడి పైకొచ్చా!

గుడిపాల జయహో బీసీ సభలో గురజాల

గుడిపాల, మార్చి 6: 'నేను స్మగ్లర్‌ను కాదు.. బతుకు తెరువు కోసం బెంగళూరు వెళ్లి కష్టపడి పైకొచ్చా. గుడిపాల మండలం కోలాపూరుకు చెందిన నన్ను నాన్ లోకల్ అని చెప్పడం వైసీపీ నేతల విజ్ఞతకే వదిలేస్తున్నా' అని చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. వసంతాపురంలో బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన



మాట్లాడారు. తాను ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. తమ ట్రస్టు ద్వారా అందిస్తున్న సేవల గురించి వివరించారు. జిల్లా టీడీపీ కార్యదర్శి కోదండయాదవ్, వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ బీసీలకు గుర్తింపు ఇచ్చింది.. తెచ్చింది టీడీపీనే అన్నారు. పలు గ్రామాల యువకులు టీడీపీలో చేరారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్యే సీకేబాబు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మండల జనసేన అధ్యక్షుడు రూప్‌కుమార్, ఎస్సీసెల్ అధ్యక్షుడు పీటర్, నాయకులు వరుణ్‌కుమార్, హేమాద్రి నాయుడు, బాలాజీ నాయుడు, దీపశ్రీ అనిల్‌కుమార్, సుమతి మురళీ నాయుడు, చంద్రమోహన్, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, సుధాకర్ యాదవ్, పళని, రవి నాయుడు, ఆనంద్ యాదవ్, శంకర్ చౌదరి, సాంబశివ నాయుడు, చల్లా, గుర్రప్ప నాయుడు, నాగరాజ యాదవ్, ఉదయ మధుసూదన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమరనాథ్ హిమలింగ దర్శనం... సర్వపాప వినాశనం


అమరనాథ్ మంచు లింగాన్ని దర్శనం చేసుకుంటున్న భక్తులు

చిత్తూరు కల్చరల్, మార్చి 6: అత్యంత ప్రవిత్రమైన, మహిమగల అమరనాథ్ మంచు లింగ దర్శనం భక్తులకు పాపాలు తొలగి ముక్తి ప్రసాదిస్తుందని ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సాంబయ్యకండ్రిగ జ్యోతిరెడ్డి నగర్‌లో ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమరనాథ మంచు లింగ ప్రదర్శనను ఆయన జ్యోతి ప్రజ్వల్వనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రదర్శన ఈనెల 10వ తేదీవరకు ఉంటుందని బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వాహకులు తెలిపారు. కట్టమంచి, గిరింపేట పగడమాను వీధుల్లో ఈనెల 8, 9 తేదీల్లో జ్యోతిర్లింగాల ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

చిత్తూరు రైల్వేస్టేషన్‌లో సదుపాయాలు మెరుగుపరచండి

చిత్తూరు రూరల్, మార్చి 6: చిత్తూరు రైల్వేస్టేషన్‌లో సదుపాయాలను మెరుగుపరచాలని రైల్వే శాఖ గుంతకల్లు ఏజీఎం ధనంజయలుకు బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యుడు చిట్టిబాబు వినతిపత్రం సమర్పించారు. బుధవారం చిత్తూరు రైల్వే స్టేషన్‌ను పరిశీలించేందుకు వచ్చిన ఏజీఎంను బీజేపీ నాయకులు కలిశారు. చిట్టిబాబు మాట్లాడుతూ చెన్నై నుంచి మదనపల్లికి మంజూరు చేసిన రైలును నడపాలని కోరారు. పలు రైళ్లను చిత్తూరు వరకు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామభద్ర, వెంకటేష్, రెడ్డి మస్తాన్ తదితరులు పాలొన్నారు. వీరితో పాటు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ కమిటీ నాయకులు కూడా ఏజీఎంను కలిసి సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. కమిటీ సభ్యులు సత్య తదితరులు పాల్గొన్నారు.

2025 నాటికి టీబీ లేని గ్రామస్థాపనే లక్ష్యం: డీఎంహెచ్‌వో

చిత్తూరు రూరల్, మార్చి 6: 2025 నాటికి టీబీ లేని గ్రామస్థాపనే లక్ష్యం గా పని చేయాలని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి అధికారులను ఆదేశించారు. బుధవా రం డీఎంహెచ్‌వో కా ర్యాలయంలో టీబీ అ ధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 616 గ్రామ పంచాయతీల్లో జనవరి 2023 నుంచి డిసెంబరు 2023 వరకు 22 గ్రామాలు క్షయ రహిత గ్రామాలుగా నిర్ధారణ చేసినట్లు తెలిపారు. ఈ గ్రామాలకు మార్చి 24వ తేది జాతీయ టీబీ దినోత్సవం సందర్భంగా టీబీ రహిత గ్రామాలుగా సర్టిఫికెట్లు, గాంధీజీ కాంస్య విగ్రహాన్ని బహూకరిస్తారని ఆమె తెలిపారు. జిల్లా టీబీ అధికారి వెంకటప్రసాద్, డీఐవో రవి రాజు, డాక్టర్లు శిరీష, జార్జ్ పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

గంగాధరనెల్లూరు, మార్చి 6: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అధికారులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, షన్మోహన్ పిలుపునిచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ అధ్యక్షతన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గంగాధరనెల్లూరు హైస్కూల్లో నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలు, రిసెప్షన్ సెంటర్ కోసం ఏర్పాటుచేసిన భవనాలను కలెక్టర్ పరిశీలించారు. జేసీ శ్రీనివాసులు, తహసీల్దార్ రవి, డిటీ తులసిరామ్, ఎలక్షన్ డీటీ విజయకృష్ణ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గంలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జేసీ శ్రీనివాసులు, ఆర్డీవో చిన్నయ్యల ఆధ్వర్యంలో సార్వత్రిక ఎన్నికలపై అధికారులతో సమావేశం జరిగింది. వివిధ రకాల మేనేజ్‌మెంట్ టీమ్స్ అధికారులను సమన్వయం చేసుకుని పొరబాట్లకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండు ఖాయమన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎస్వో, ఎంసీసీఎస్, టీఎఫ్ఎస్‌టీవీ, ఎస్‌టీవీవీటీ, అకౌంట్స్ టీమ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలన్నీ ఉండాలి

చిత్తూరు, మార్చి 6: నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్దేశించిన అన్ని సౌకర్యాలు ఉండాలని ఏఈఆర్వో, కమిషనర్ అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై బుధవారం ఆమె వార్డు అమినిటీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంహెచ్‌వో లోకేష్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

జనసేన పార్టీ మండల ఇన్‌చార్జుల నియామకం

వెదురుకుప్పం, మార్చి 6: జనసేన పార్టీ తరపున జీడీనెల్లూరు నియోజకవర్గంలోని మండలాలకు ఎన్నికల ఇన్‌చార్జులను నియమించామని, వారు తెలుగుదేశం పార్టీ కమిటీ, ఇన్‌చార్జికి సహకరిస్తూ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెనుమూరు మండలానికి భానుప్రసాద్, వెదురుకుప్పం మండలానికి యతీశ్వర్‌రెడ్డి, కార్వేటినగరానికి రాఘవ, ఎస్ఆర్‌పురానికి హరీశ్వర్, జీడీనెల్లూరుకు జయపాల్‌రాజు, పాలసముద్రానికి వెంకటేశ్‌యాదవ్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. కార్వేటినగరం టౌన్‌కు మాత్రమే విజయ్‌ని నియమించామని పేర్కొన్నారు.

భూములిస్తారా.... నష్టపరిహారం చెల్లిస్తారా..?

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన


డీటీ కల్యాణికి వినతిపత్రం ఇస్తున్న 190 రామాపురం రైతులు

గుడిపాల, మార్చి 6: భూములిస్తారా... లేక నష్టపరిహారం చెల్లిస్తారా అని బుధవారం 190 రామాపురం దళిత రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా అధ్యక్షుడు నాగరాజన్ మాట్లాడుతూ భూములు సీఎంసీ కోసం లాక్కొని ఇప్పుడు నష్టపరిహారం చెల్లించకుండా రైతులను ఇబ్బంది పెట్టడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. నష్టపరిహారం చెల్లించాలని కొన్ని సంవత్సరాలుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం, మండల తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఎందుకు పట్టించుకోవడం లేదని, తాము దళితులుగా పుట్టడమే నేరమా..? అని రైతులు ప్రశ్నించారు. అనంతరం డీటీ కల్యాణికి వినతిపత్రం అందజేశారు.

బీసీ డిక్లరేషన్ ప్రకటించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు: టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, మార్చి 6: బీసీ డిక్లరేషన్ ప్రకటించిన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్, జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తి నాని, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ సామాజిక వర్గప్రజల సంక్షేమం కోసం 50 సంవత్సరాలు నిండిన బీసీలకు వృద్ధాప్య పెన్షన్, రూ.3 వేలు ఇస్తున్న పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచడం, విద్యారంగంలో ఆర్థిక సాయం, కులాలవారి మేనిఫెస్టో తదితర అంశాలపై బీసీల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆప్రకటనలో వారు తెలిపారు.

పేదల సొంతింటి కల నెరవేర్చండి: బీజేపీ

చిత్తూరు (సెంట్రల్), మార్చి 6: పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కల నెరవేర్చాలని కోరుతూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు బుధవారం జిల్లా కలెక్టర్ షన్మోహన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016-17లో అప్పటి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో నగర సమీపంలోని పూనేపల్లి వద్ద ఇళ్ల నిర్మాణం ప్రారంభించారన్నారు. 2019లో ఎన్నికల కోడ్ కారణంగా 70 శాతం పూరైన పనులను నిలిపివేశారని, 8ఏళ్లు గడుస్తున్నా, వంద శాతం పూర్తి కాలేదన్నారు. వీటిని త్వరితగతిన పూర్తి చేసి పేద, మధ్య తరగతి లబ్ధిదారులకు అందించాలన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో టీడీఆర్ కమిటీ సమావేశం


రికార్డులను పరిశీలిస్తున్న కమిటీ బృందం

చిత్తూరు, మార్చి 6: నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం కమిషనర్ అరుణ అధ్యక్షతన టీడీఆర్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో అనంతపురం ఆర్డీడీటీపీ సంజీవ్‌కుమార్, డీటీసీపీవో మ . దు, సబ్ రిజిస్ట్రార్ చలపతిరావు, ఏసీపీ రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో టీడీఆర్ జారీ అంశంపై చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా టీడీఆర్ జారీపై చర్యలు తీసుకోవాలని సూచించారు. మాస్టర్ ప్లాన్‌పై జీవో ఎంఎస్ నెంబర్ 312, 112ల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నగర ప్రణాళికా విభాగ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చిత్రకళా పోటీలో.. పీఈఎస్ పాఠశాలకు బంగారు పంట


బంగారుపతకాలు సాధించిన వారిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

యాదమరి, మార్చి 6: ఈ నెల 2వ తేదీన గుంటూరు కేఎల్ యూనివర్సిటీ డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమి ఆధ్వర్యంలో 11వ ఆల్ ఇండియా చిల్డ్రన్ అండ్ యూత్ ఆర్ట్ కాంపిటీషన్ కమ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో పీఈఎస్ పాఠశాల ఆర్ట్ మాస్టర్ రాజ్‌కుమార్ ఆల్ ఇండియా చిత్రకళా అవార్డును కైవసం చేసుకున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన చిత్రకళ నైపుణ్యతకు నిదర్శనంగా నేషనల్ లెవల్‌లో 20 మంది బంగారు పతకాలు సాధించగా, 15 మంది వెండి పతకాలు సాధించారు. నిరంతర శ్రమ, అకుంఠిత దీక్ష, పట్టుదల ఉంటే అన్నింటిలోనూ ముందంజలో ఉంటామని ప్రిన్సిపాల్ కృష్ణబాబు తెలిపారు. అనంతరం పతకాలు సాధించిన ఆర్ట్‌మాస్టర్, విద్యార్థులు ఆయనను అభినందించారు.

ఎండల్లో బయట తిరగొద్దు

పాలసముద్రం, మార్చి 6: వేసవి ప్రారంభంలోనే ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున పసిపిల్లలు, వృద్ధులు బయట తిరక్కుండా జాగ్రత్తలు పాటించేటట్లు గ్రామాల్లోని ప్రజలకు ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు అవగాహన కల్పించాలని డాక్టర్ మోహనకృష్ణ పేర్కొన్నారు. బుధవారం పాలసముద్రం పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందువల్ల ప్రజలు వడదెబ్బకు గురికాకుండా చూడాలన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు బయటకు వెళ్లేటప్పుడు గొడుగులు, టోపీలు ధరించాలని, కళ్లకు చలవద్దాలు ఉపయోగించాలని, నూలు వస్త్రాలు ధరించాలన్నారు. ఎక్కువగా నీరు తాగాలని, ప్రజలకు అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు గ్రామాల్లో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.